క్లుప్తంగా

కోటమ్మకు వెండి కిరీటం బహూకరణ



వెండికిరీటాన్ని అందజేస్తున్న ముత్తుకుమార్

కోట: గ్రామదేవత కోటమ్మకు ఆదివారం చెన్నైకు చెందిన భక్తుడు ముత్తుకుమార్ కుటుంబ సభ్యులు రూ.5 లక్షల విలువ చేసే 5 కిలోల వెండి కిరీటం, కవచాలను బహూకరించారు. మొక్కులు చెల్లించేందుకు వచ్చిన ముత్తుకుమార్ అమ్మవారి దర్శనానంతరం ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డికి కిరీటాన్ని అందజేశారు. తరువాత ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అల్లం రమణయ్య, యరటపల్లి మధుసూదన్‌రెడ్డి, ఆవుల సుబ్బయ్య, ఉప సర్పంచ్ గాది భాస్కర్, నల్లపరెడ్డి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

బెంచ్‌ల ఏర్పాటు



బెంచ్‌లు అందజేస్తున్న సంస్థ నిర్వాహకులు

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం గూడూరుకు చెందిన ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సిమెంట్ బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ 8 సిమెంట్ బెంచ్‌లను వితరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ గూడూరు పట్టణానికి చెందిన రమేష్ బేకరి యజమాని రమేష్, యమహా సుబ్రహ్మణ్యం, ఆర్ ఆర్ ప్రభాకర్‌రెడ్డి, జీజీ నాయుడు, దేశిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి దాతృత్వంతో సిమెంట్ బెంచ్‌లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ య రటపల్లి జానకిరామిరెడ్డి, ఆలయ ట్రస్టీ దువ్వూ రు చంద్రశేఖరరెడ్డి, ఆలయ అర్చకులు శివకుమార్, పిల్లెల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, క్రిష్టారెడ్డి, శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చిగురుపాటి పవన్ తదితరులు

వెంకటగిరి: సంఘ సంస్కర్త, మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా ఈ నెల 5వ తేదీన వెంకటగిరిలో నిర్వహించే మోటారుసైకిల్ ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మార్పు స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిగురుపాటి పవన్ తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం జగ్జీవన్‌రాం జయంతి నిర్వహణపై ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1908 ఏప్రిల్ 5న జన్మించిన జగ్జీవన్‌రాం భారత పార్లమెంట్‌లో నలభై ఏళ్లపాటు వివిధ మంత్రి పదవులు, ఉపప్రధానిగా దేశానికి సేవలందించిన ఆదర్శనీయుడని తెలిపారు. దేశంలో హరితవిప్లవం, వ్యవసాయాన్ని ఆధునికీకరించడంలో ఆయన అందించిన సహకారం అనితరసాధ్యమన్నారు. ఆయన జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడవయ్య, పార్థయ్య, చిరంజీవి, కోటీశ్వరరావు, రత్నం, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కోదండరాముని తెప్పోత్సవాలు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి తెప్పోత్సవాలు సోమ, మంగళ, బుధవారాల్లో వేడుకగా నిర్వహించనున్నారు. స్వామివారు రోజూ రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు శ్రీరామచంద్ర పుష్కరిణిలో తెప్పపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు. అలాగే రోజూ ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు ఆలయ ఆవరణలో సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మొదటి రోజు సీతాలక్ష్మణ సమేత శ్రీరాముల వారు తెప్పలను అధిరోహించి శ్రీరామచంద్ర పుష్కరిణిలో ఐదు చుట్లు విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రెండో రోజు ఏడు చుట్లు, చివరి రోజు తొమ్మిది చుట్లు తిరుగుతారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తిరుచానూరుకు చెందిన ఉమశ్రీ బృందం కూచిపూడి నృత్యం ప్రదర్శించింది. పుష్పాంజలి, మూషికవాహన, శాంతాకారం, శివతాండవం, శంభో శివ శంభో, ఘల్లు ఘల్లు, ముద్దుగారే యశోద తదితర గేయాలకు కళాకారులు భూమిజ, లవీష, భవిష్య, దీక్షిత, శ్రేష్ట, రిషిత, వర్ష, లక్షయ, భావిష చక్కగా నాట్యం చేశారు. వారిని ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

ఘనంగా మట్టల పండుగ



చిల్లకూరు: మట్టలతో ర్యాలీ చేస్తున్న చిన్నారులు



గూడూరులో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

గూడూరు: పట్టణంలోని క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులు స్థానిక ఎస్‌ఏఎల్‌సీ చర్చి నుంచి గీతాలు ఆలపిస్తూ భారీ ర్యాలీ చేశారు. ఈ ర్యాలీ చర్చి నుంచి ఆస్పత్రి రోడ్డు మీదుగా పాత బస్టాండ్ తదితర ప్రాంతాల్లో సాగింది. అనంతరం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ప్రశాంత్‌కుమార్ తదిరులు పాల్గొన్నారు.

చిల్లకూరులో వేడుకలు

చిల్లకూరు: ఈస్టర్ పర్వదినానికి ముందుగా వచ్చే ఆదివారం రోజు క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం వేడుకలను జరుపుకున్నారు. కమ్మవారి పాళెంలోని లోగోస్ లూథరన్ చర్చిలో సంఘ కాపరి రెవరెండ్ విజయకుమార్ ఆధ్వర్యంలో పిల్లలు మట్టలను చేత పట్టుకుని వీధుల్లో తిరుగుతూ యేసు రాజుకు జయం అని నినాదాలు చేస్తూ ఆలయంలోకి ప్రవేశించారు. అలాగే ఏరూరులోని జాన్స్ లూథరన్ చర్చిలో పాస్టర్ మంచాల లలితమ్మ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలు జరుపుకున్నారు. మండలంలోని ఓడూరు, కలవకొండ, మోమిడి, పల్లమాల, అన్నంబాక, తిమ్మనగారిపాళెం, నాంచారమ్మపేట గ్రామాల్లో కూడా క్రైస్తవులు వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్లు దైవ సందేశం ఇస్తూ 2023 సంత్సరాల క్రితం ఏసు క్రీస్తు యేరూషెలం ప్రాంతంలో సంచరించే సమయంలో ఆయన గాడిద పిల్లను ఎక్కి వస్తుండగా అక్కడి ప్రజలు ఖర్జూరం మటకటలను పరచి ఆలయానికి స్వాగతం పలికారని, దీనికి గుర్తుగా మట్టల ఆదివారం వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం: మండలంలోని పలు చర్చిల్లో, మందిరాల్లో ఆదివారం మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. మట్టల ఆదివారం ప్రాముఖ్యతను పాస్టర్లు తెలియజేశారు. దొరవారిసత్రం, ఆనేపూడి, రామారెడ్డికండ్రిగ, ముచ్చలగుంట, నెల్లూరుపల్లి గ్రామాల్లో ఎస్‌ఏఎల్‌సీ చర్చిల్లో చిన్నారులు మట్టలు చేత పట్టుకుని పలు నినాదాలు చేస్తూ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



రాపూరు పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

చిట్టమూరు: మండలంలో జరగనున్న పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ బీవీ కృష్ణయ్య ఆదివారం తెలిపారు. మండలంలో చిట్టమూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, కొత్తగుంటలోని టీఎమ్మార్ స్కూల్ పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. టీఎమ్మార్ స్కూల్లో 209 మంది, చిట్టమూరు జెడ్పీ హైస్కూలులో 235 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారని చెప్పారు. ఈ రెండు పరీక్ష కేంద్రాలకు నసీంఅలీ, వెంకయ్యను పర్యవేక్షణ అధికారులుగా నియమించారన్నారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యంతో పాటు విద్యార్థులు బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు.

డీవీ సత్రంలో..

దొరవారిసత్రం: మండలంలో బీసీ గురుకులం, ఏకొల్లు జెడ్పీ పాఠశాలలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు సర్వసిద్ధం చేసినట్లు ఎంఈఓ మస్తానయ్య తెలిపారు. సోమవారం నుంచి నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగనున్నాయన్నారు. డీవీ సత్రం గురుకుల పాఠశాలలో 264 మంది, ఏకొల్లు జెడ్పీహైస్కూలులో 134 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారని చెప్పారు.

రాపూరులో..

రాపూరు: కండలేరు డ్యామ్, రాపూరులోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాటు పూర్తి చేసినట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో రాపూరు, సిద్ధవరం, పెనుబర్తి, కరుణామయి, గుడ్‌షెప్పర్డ్, జీపీ నరసింహం పాఠశాలల విద్యార్థులు 519 మంది పరీక్షలు రాయనున్నారని చెప్పారు. అలాగే కండలేరు డ్యామ్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో కండలేరు గురుకులం, వేపినాపి, కండలేరు డ్యామ్ జెడ్పీ హైస్కూలు విద్యార్థులు 139 మంది పరీక్షకు హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

చిల్లకూరు: మండలంలోని తిమ్మనగారిపాళెంలో అంబేడ్కర్ కమిటీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. తొలుత డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ గ్రామ కమిటీ కన్వీనర్ జోగి శివ మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని యువతకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ గిద్దలూరు సుమలత మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ బీసీలనే తారతమ్యాలు లేకుండా అందరూ కలసి ఉండాలనే అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత క్రీడా పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. 10 రోజులు పాటు నిర్వహించే క్రికెట్ పోటీల్లో విజేతలకు ఈ నెల 14వ తేదీన అంబేడ్కర్ జయంతి రోజున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుస్సారెడ్డి రాధాకృష్ణరెడ్డి, దేవిరెడ్డి వంశీధర్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, గిద్దలూరు రమణయ్య, జోగి ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సరుకుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మగ్దూం మోహిద్దీన్

గూడూరు: స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలు ఆవరణలో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు ఫల సరుకులు పంపిణీ చేశారు. సంఘం నాయకులు దశరథరామిరెడ్డి మాట్లాడుతూ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధారెడ్డి జనార్దన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ప్రతి నెలా దివ్యాంగులకు నెలకు సరిపడా ఫల సరుకులను అందజేస్తున్నారన్నారు. సభ్యులు బీ ధనుంజయరెడ్డి, ప్రజేంద్రరెడ్డి, సిద్ధారెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు,లుంగీలు..

మహమ్మద్ ఫ్రక్రుద్దీన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు చీరలు, లుంగీలను పంపిణీ చేశారు. పట్టణంలోని ఐసీఎస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్న వారికి చీరలు, లుంగీలను పంపిణీ చేసినట్లు నిర్వాహకులు మగ్దూం మోహిద్దీన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ పర్వదినం సందర్భంగా 12 ఏళ్లుగా పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

మహాసభలకు తరలిరండి

రాపూరు: నెల్లూరులో మంగళవారం జరగనున్న రైతు కూలీ జిల్లా మహాసభలకు మండలంలోని రైతు కూలీలు తరలిరావాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి సునీత పిలుపు నిచ్చారు. రాపూరులో ఆదివారం జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సుబ్బరాయుడు, రమణయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ.. పండింది

కిలో రూ.60 నుంచి రూ.90 ధర



నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న రైతు, కూలీ

సైదాపురం: నిమ్మ రైతుల పంట పండింది ఈఏడాది. అనూహ్యంగా ధరలు పైపైకి పెరుగుతుండడంతో నిమ్మ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కనివినీ ఎరుగని రీతిలో నిమ్మ ధరలు పలుకుతుండటంతో అప్పుల ఊబి నుంచి ఈ ఏడాది గట్టెక్కుతామని భావిస్తున్నారు. సైదాపురం మండలంలో సుమారు 3,500 హెక్టార్లలో నిమ్మ సాగు ఉంది. ఇటీవల కాలంలో గూడూరు నిమ్మ మార్కెట్‌లో కిలో కాయలు రూ. 60 నుంచి రూ.90 వరకు ధర పలుకుతున్నాయి. దీంతో రైతులకు ఊరట కలుగుతోంది. నెలాఖరులోపు కిలో రూ.100 వరకు ధర పెరిగే అవకాశాలున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

వరద నీరు రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు



కాలనీ వాసులతో మాట్లాడుతున్న రవికుమార్

సైదాపురం: కాలనీలోకి వరదనీరు రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జేసీఎస్ కన్వీనర్, మాజీ ఎంపీపీ మన్నారపు రవికుమార్ తెలిపారు. సైదాపురం పంచాయతీలోని మొలకలపూండ్ల ఎస్సీ కాలనీని ఆదివారం ఆయన సందర్శించారు. అనంతరం కాలనీ వాసులతో వరదనీటితో కలిగే ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించి, వరదనీటి ముప్పు నుంచి కాపాడతానని హామీ ఇచ్చారు. ఆయన వెంట సచివాలయం కన్వీనర్ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

రాయంచపై రామయ్య ఏతెంచెన్!



గూడూరు: హంస వాహనంపై ఊరేగుతున్న సీతారాములు



చిల్లకూరు:చక్రస్నానం నిర్వహిస్తున్న వేద పండితులు



ఓజిలి: పూజలు చేస్తున్న అర్చకులు

గూడూరు: స్థానిక కోనేటిమిట్టలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు హంస వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం స్వామి,అమ్మవార్లకు అర్చన, అభిషేకం, విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సీతారాములను హంసవాహనంపై కొలువుదీర్చి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లూరు శ్రీనివాసులు పర్యవేక్షించారు. హంస వాహన సేవకు జోగిపర్తి వెంకటరమణయ్య, శైలజ ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కమనీయం.. కల్యాణం

ఓజిలి: పెదపరియ రాచపాళెంలోని రామాలయంలో ఆదివారం సీతారాముల కల్యాణం కనులపండువలా నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా నాలుగోరోజు ఆలయంలో స్వామి అమ్మవార్లకు విశేషాలంకరణ చేశారు. మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ స్వామివారికి పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకెళ్లి, సమర్పించారు. గ్రామానికి చెందిన సురేంద్రరాజు, మోహన్‌రాజు, సుబ్రమణ్యంరాజు, రామచంద్రరాజు, ఎం సుబ్రమణ్యంరాజులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదానం చేశారు. వేదపండితులు ఉభయకర్తల గోత్రానామాలతో వైభంగా పూజలు చేశారు. రాత్రి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. సంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తులను అలరించాయి.

వైభవంగా చక్ర స్నానం

చిల్లకూరు: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. తమ్మినపట్నంలోని కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో ఆరో రోజున స్వామి వారికి నిత్య కొలువు, హోమం, బలిహరణ చేశారు. సాయంత్రం ధ్వజావరోహణం చేశారు.

కిలివేటి..మేకపాటితో మేరిగ భేటీ



కలివేటి సంజీవయ్యను కలిసిన మేరిగ



మేకపాటి విక్రమ్‌రెడ్డిని కలిసిన మేరిగ మురళీధర్

గూడూరు: సూళ్లూరుపేట, ఆత్మకూరు ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, మేకపాటి విక్రమ్‌రెడ్డిని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని వారి వారి స్వగృహాల్లో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ వారిని కలిసి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి, ఘనంగా సత్కరించారు. అనంతరం వారు కూడా మేరిగను సత్కరించారు. వారు పలు విషయాలను చర్చించుకున్నారు.

లాభాల పూ'బంతి'



తాళ్వాయిపాడులో సాగు చేసిన బంతిపూలు

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు, శిరసనంబేడు రాజుపాళెం గ్రామాలకు చెందిన కొందరు రైతులు నిమ్మ పంటలో అంతర పంటగా బంతి పూలు సాగు చేశారు. దీంతో వారికి లాభాల పంట పండుతోంది. నిమ్మచెట్లు పెరుగుతున్న దశలో వాటి మధ్య అంతర పంటగా ఇటీవల ఈస్ట్ అండ్ వెస్ట్ రకానికి చెందిన బంతిసాగు చేస్తున్నారు. చిత్తూరు జిల్లా నుంచి మేలు రకం బంతి మొక్కలను ఒక్కొక్కటి రూ.2 వంతున ఎకరానికి నాలుగు వేల మొక్కలను నాటారు. మెట్ట భూమి కావడంతో భూసారం పెంపొందించేందుకు దుక్కి చేసి, దానికి వర్మీ కంపోస్టు ఎరువును మొక్కల కుదుళ్లలో వేసి, నీరు పెట్టడంతో బంతి మొక్కలు ఆరోగ్యంగా పెరిగి నాణ్యమైన అధిక దిగుబడులు రావడంతో మంచి లాభాలు పొందుతన్నారు. సాగు ప్రారంభం నుంచి ఎకరానికి సుమారు రూ.60 వేలు పెట్టుబడి పెట్టామని, ప్రస్తుతం పూలు మార్కెట్‌లో కిలో బంతిపూలు రూ.45 నుంచి రూ.70 వరకు ధర పలుకుతోంది. దీంతో లాభాలు పొందుతున్నామని రైతులు పేర్కొంటున్నారు.

వచ్చేవచ్చే.. వాన మబ్బుల్లారా..



వాకాడు: ఒక పక్క ఎండ, మరో పక్క నల్లని మబ్బులు

ప్రకృతిలో వి'చిత్రాలు' ఎన్నో.. వానొచ్చే ముందు దట్టమైన మేఘాలు.. నింగి నేల ఏకమైనట్లు కమ్ముకున్న కారుమబ్బులు.. చూపరులను ఆకట్టుకున్నాయి. వరుణుడికి స్వాగతం పలుకుతున్నట్లు ఆకాశ మనోహర రూపం కనువిందు చేసింది. తిరుపతి జిల్లాలోని వాకాడు, దొరవారి సత్రం మండలాల్లో మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో వర్షం వచ్చే ముందు ఆహ్లాదకరంగా మారిన వినీలాకాశాన్ని సాక్షి క్లిక్ మనిపించింది.

-వాకాడు/దొరవారి సత్రం



వాకాడు: గొల్లపాళెం వద్ద పొలాల్లో కమ్ముకున్న నల్లని మబ్బులు



దొరవారిసత్రంలో కమ్ముకున్న కారుమబ్బులు

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం ఎదుట ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌ఎం సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసులు, సినీనటుడు రాజేంద్రప్రసాద్, సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీనివాసులురాజు, ప్రముఖ హీరోయిన్ శ్రేయ దర్శించుకున్నారు. వారికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం పలికారు. అధికారులు లడ్డు ప్రసాదాలు అందజేశారు.